క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితునికి వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేస్తున్న దృశ్యం

మెంటాడ: మండల కేంద్రంలో ఇటీవల పాండ్రంకి పైడిరాజు అనే మహిళ మృతి చెందారు. ఈ మేరకు ఆమె భర్త శంకరరావుకు వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.10 వేలను తక్షణ సాయంగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గణేష్, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన 4,689 స్టీల్ గ్లాసులు



ఎమ్మార్సీకి చేరుకున్న స్టీల్ గ్లాసులను భద్రపరుస్తున్న సిబ్బంది

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం రాగిజావ పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం దీనికి అవసరమైన స్టీల్ గ్లాసులను ప్రభుత్వం సరఫరా చేస్తోందని ఎంఈఓ జె.త్రినాథరావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీకి 4,689 స్టీల్ గ్లాసులు వచ్చాయని, వీటిని మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయనున్నామన్నారు.

28 లీటర్ల సారా స్వాధీనం

మెంటాడ: మండలంలోని కూనేరు శివారులో సారా తరలిస్తున్న ఓ వ్యక్తి పట్టుకుని, 28 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఆండ్ర ఎస్ఐ సిద్ధార్థ మంగళవారం తెలిపారు. కూనేరు నుంచి రామచంద్రాపురం సారా తరలిస్తుండగా అతడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామన్నారు.

సోషల్ ఆడిట్‌పై ఒక్కరోజు శిక్షణ

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)కు సంబంధించి, స్థానిక ఓ ప్రైవేట్ కళాశాలలో ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా తరగతులు మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ జె.త్రినాథరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, జగనన్న గోరుముద్ద పథకం, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులకు సంబంధించి, ప్రధానోపాధ్యాయులంతా పక్కాగా ఆడిట్ నిర్వహించి, వివరాలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ మీసాల ప్రసాదరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ధర్నా



తహసీల్దార్ రాజారావుకు తమ సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బొబ్బిలి: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మంగళవారం ధర్నా చేపట్టారు. గ్రాట్యుటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా దానిని కేంద్రం అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రాజారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు జె.కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

తెర్లాం: ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులను ఉద్దేశించి, మాట్లాడిన ఆయన ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. నిర్దేశిత కొలతల్లో సక్రమంగా పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు.

స్థల పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి పీఆర్ జేఈ ప్రభాకర్ మంగళవారం స్థల పరిశీలన చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సామాజిక భవన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరడంతో స్థల పరిశీలన చేసి అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ప్రతిపాదనలను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు పంపించనున్నట్లు చెప్పారు. సర్పంచ్ నక్క తవిటమ్మ, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పి.రామకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ నక్క ఉమామహేశ్వరరావు, నక్క శ్రీను, తదితరులు ఉన్నారు.

జనం నినాదంగా..
'మా నమ్మకం నువ్వే జగన్'



రాజాం: కాకర్లవీధిలో సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, తదితరులు

వాడవాడలా నిర్వహిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై.. జగన్.. జయహో.. వైఎస్సార్ సీపీ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు ఘనస్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నేతలు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీకి పాలనలో ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని, ప్రజాసంక్షేమం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురంలోని ఆగురు వీధిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



సంతకవిటి: గొల్లవలసలో జగనన్నకు మద్దతుగా సర్పంచ్ దాలినాయుడు, పార్టీ నాయకుల ప్రచారం



రేగిడి: కందిశలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ కెల్ల మన్మథరావు, తదితరులు



తెర్లాం: లోచర్లలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అన్నపూర్ణ తదితరులు

ఉనికి కోసమే చంద్రబాబు ఆరాటం

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో కనుమరుగవుతోన్న టీడీపీ ఉనికి కోసమే ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆరాటపడుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు విమర్శించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం, అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఆయన, ఆయన పుత్రరత్నం నారా లోకేష్ చూడలేకపోతున్నారని ధ్వజమెత్తారు. భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చామన్న ధీమాను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎప్పుడూ చూపించలేదన్నారు. నిత్యం పార్టీ నాయకులు ప్రజల్లో ఉండేలా కార్యక్రమాలు రూపొందించి, అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ఇది పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నింపిందన్నారు. వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి, ఓర్వలేకే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, అయితే ప్రజలు వాటిని నమ్మడం లేదన్నారు.

గతంలో టీడీపీ ఏమీ అభివృద్ధి చేయలేదనే జనాలు ఆ పార్టీని పక్కనబెట్టారని, అలాంటి వారు ఇప్పుడు ఇంత అభివృద్ధి జరుగుతున్నా ఏం జరగలేదని సెల్ఫీలకు ఫోజులిస్తుండడం హాస్యాస్పదమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ 2019 సీన్ రిపీట్ అవుతుందని, ఖచ్చితంగా తమ ప్రభుత్వమే మళ్లీ భారీ మెజార్టీతో అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, పట్టణ, మండల జేసీఎస్ ఇన్‌చార్జిలు రేజేటి ఈశ్వరరావు(విసు), తమ్మిరెడ్డి దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి ఘనసన్మానం



ఎంపీపీ ఉమాలక్ష్మిని సన్మానిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీపీగా తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఎంపికై, సోమవారం అవార్డు అందుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఆమెను మంగళవారం సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరి సహాయ, సహకారాలతో తాను ఉత్తమ ఎంపీపీగా ఎంపికయ్యాయని, ముున్ముందు ఇలాగే సహకరించాలన్నారు. అందరి సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఉపాధి ఏపీఓ జగదీశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఉపాధి సిబ్బంది, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్‌సీఎం చర్చి వార్షికోత్సవం



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్‌లు



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

రాజాం: పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో ఉన్న సెయింట్ థెరిస్సా చైల్డ్ జీసెస్ ఆర్‌సీఎం చర్చి (పునీత చిన్న థెరిసమ్మ ఆర్‌సీఎం చర్చి) 30వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయ్‌కుమార్, చర్చి ఫాదర్ విజయరెడ్డి, తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పలువురు ప్రజాప్రతినిధులతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, జి.సిగడాం, పొందూరు, తెర్లాం తదితర మండలాల నుంచి వందలాది మంది క్రీస్తు విశ్వాసకులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి

రాజాం సిటీ: శిక్షణలో నేర్చుకున్న అంశాలతో పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలని జిల్లా రిసోర్స్ పర్సన్ పి.సురేష్‌కుమార్, ఎంఈఓ పి.నాగయ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై మంగళవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతీ అంశాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఆవుదూడల ప్రదర్శన

బొబ్బిలి: జాతీయ కృత్రిమ గర్భాధారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మెట్టవలస గ్రామంలో ఆవుదూడల ప్రదర్శన మంగళవారం చేపట్టారు. మేలైన రకాల దూడలను ఎంపిక చేసి, వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డీడీ ఆర్.నీలయ్య, ఏడీ ఎల్.విష్ణు పాల్గొన్నారు.

దేశతల్లి, సరేపోలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

బొబ్బిలి: స్థానిక కోరాడ వీధిలో జరుగుతున్న గ్రామదేవతల ఉత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే హాజరై, దేశతల్లి, సరేపోలమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు.

నవధాన్యాల సాగుతో ఆదాయం

రేగిడి: రైతులు వేసవి దుక్కిలు చేశాక నవధాన్యాలను సాగుచేస్తే ఆదాయంతో పాటు భూమి సారవంతంగా మారుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింహాచలం, గౌరీశ్వరరావు అన్నారు. మండలంలో సంకిలి ఆర్బీకేలో మంగళవారం నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంకిలి పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణారావు, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, అప్పాపురం సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, వీఏఏ వినీత, ఐసీఆర్‌పీలు తవిటినాయుడు, నారాయణరావు, శ్రీలత, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వంగర: మండలంలో బాగెంపేట–పటువర్ధనం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమైంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.2.29 కోట్లతో 3.4 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మిస్తున్నట్లు మండల ఇంజినీరింగ్ అధికారి ఆనందరావు తెలిపారు. పనులు సకాలంలో పూర్తిచేస్తామన్నారు.

గ్రామదేవతకు మొక్కు చెల్లింపు

రేగిడి: మండలంలో అప్పాపురంలో మంగళవారం ఘనంగా గ్రామదేవత పండగ నిర్వహించారు. గ్రామదేవత బిళ్లాడమ్మ తల్లి వనానికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయగా, అప్పాపురం పరిసర ప్రాంతాలు నుంచి వేలాది మంది తరలివచ్చారు. సర్పంచ్ కరణం నిర్మల, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దుర్గారావు, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన

రాజాం: మండలంలో అంతకాపల్లి గ్రామంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు మంగళవారం పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై ఆరాతీశారు. క్లాప్ మిత్రలతో మాట్లాడి, గ్రామాల్లో చెత్తను పూర్తిస్థాయిలో సేకరించి, ఈ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీచేశారు. గ్రామంలో అభివృద్ధి పనులపై పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు వద్ద వివరాలు సేకరించారు.

కనులపండువగా సిరిమానోత్సవం

- వైభవంగా కొత్తపోలమ్మ, పోలపైడమ్మ సిరిమానోత్సవం
- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సిరిమానోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



కోమటిపల్లిలో సిరిమానుకు పూజలు చేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లంపేటలో కొత్తపోలమ్మతల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మధ్యాహ్నం 3.30 గంటలకు సిరిమానోత్సవానికి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. సంప్రదాయం ప్రకారం బొబ్బిలికి చెందిన పూజారి బత్తిన సూరిబాబు భక్తుల హర్షధ్వానాల నడుమ తమటాల ముసిలినాయుడు ఇంటి డాబాపై నుంచి సిరిమాను అధిరోహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య సిరిమాను ఊరేగింపు జరిగింది. ఈ క్రమంలో భక్తులు జై పోలమ్మ తల్లి అని నినదిస్తూ అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీఐ ఎం. నాగేశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా, మండలంలోని కోమటపల్లి గ్రామంలో పోలపైడమ్మతల్లి, పరదేశమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం 4 గంటలకు సిరిమానోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల వరకు సిరిమాను ఊరేగింపు జరగ్గా, సిరిమాను వైభవాన్ని చూసేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇదే కార్యక్రమంలో మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పాల్గొని, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎం.బూర్జవలస గ్రామంలో బంగారమ్మతల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బంధు,మిత్రుల రాకపోకలతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని అలజంగి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలుతున్నారని విమర్శించారు. అయితే ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, మరింత అభివృద్ధి, సంక్షేమం జరగడం పక్కా అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేతనం గిట్టుబాటయ్యేలా ఉపాధి పనులు



సంతకవిటి: ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీచేస్తున్న ఎంపీడీఓ

రాజాం సిటీ: ఉపాధిహామీ పనులు చేపడుతున్న వేతనదారులంతా గిట్టుబాటు కూలీ అందేలా పనులు చేయాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండలంలోని ముద్దాడజోగివలస పంచాయతీ గెడ్డవలస వెంకన్నచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులకు హాజరుకావాలని వేతనదారులకు సూచించారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేస్తే ప్రతి ఒక్కరికీ రూ. 272లు ఆదాయం గిట్టుబాటు అవుతుందన్నారు. పనిప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని టీఏలకు సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సాగునీటి కాలువ, చెరువులో జరుగుతున్న ఉపాధిపనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి మంగళవారం పరిశీలించారు. మస్టర్ సీట్లు వెరిఫికేషన్ అనంతరం వేతనదారులకు అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు వేతనదారులుకు అందించి, పనుల వద్ద వీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దాహం వేసిన సమయంలో వీటిని నీటిలో కలిపి తాగడం ద్వారా ఉపశమనం పొందవచ్చన్నారు.

వివాదాలు తలెత్తకుండా హద్దురాళ్ల ఏర్పాటు

- ఆర్డీఓ పి.శేషశైలజ



తెర్లాం: పుల్లేరువలసలో హద్దురాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

రామభద్రపురం: వివాదాలు తలెత్తకుండా హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని ఆర్డీఓ పి.శేషశైలజ సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆమె తహసీల్దార్ సుబ్బారావుతో సమావేశమై భూముల రీసర్వేపై సమీక్షించారు. ప్రస్తుతం హద్దురాళ్ల ఏర్పాటు జరుగుతోందని తహసీల్దార్ సమాధానమివ్వగా, రైతుల సమక్షంలో హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. సర్వేపై రైతులకు వస్తున్న సందేహాలను నివృత్తి చేయాలన్నారు. అధికారులు వేసిన హద్దురాళ్లు ఎవరైనా తీసివేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జాతీయ రహదారి విస్తరణ నేపథ్యంలో ఆరికతోట, రామభద్రపురం బైపాస్, తారాపురం గ్రామంలో రహదారి పక్కనే ఉన్న దుకాణాలు, ఇళ్లు తొలగించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. చట్ట ప్రకారం ఎవరికైనా పరిహారం ఇవ్వాల్సి వస్తే ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామన్నారు.

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా హద్దురాళ్ల ఏర్పాటులో ఎటువంటి పొరపాట్లు జరగకుండా సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు చూడాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని పుల్లేరువలస గ్రామంలో హద్దురాళ్ల ఏర్పాటును మంగళవారం పరిశీలించిన ఆయన మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలోనే సర్వేరాళ్లు వేయాలని తెలిపారు. వీలైనంత త్వరగా హద్దురాళ్ల ఏర్పాటును పూర్తి చేయాలన్నారు.

మలేరియా మహమ్మారిని తరిమికొడదాం



మెంటాడ: మలేరియా నివారణపై అవగాహన కల్పిస్తునవైద్యారోగ్య సిబ్బంది



రాజాం: బొద్దాంలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఆస్పత్రి, పీహెచ్‌సీల వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీలు చేపట్టి, చిన్న ప్రాణులు–పెద్ద ప్రమాదాలు, మన ఆరోగ్యం–మన చేతుల్లోనే, దోమతెరలు వాడండి మలేరియాను నివారించండి అని నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి, మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వణుకుతో కూడిన జ్వరం, దగ్గు, కండరాల నొప్పి, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే మలేరియాగా పరిగణించి, తక్షణమే చికిత్స తీసుకోవాలని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: సంతకవిటిలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ



రేగిడి: మునకలవలసలో అవగాహన కల్పిస్తున్న బూరాడ పీహెచ్‌సీ డాక్టర్ భార్గవి, సిబ్బంది



రాజాం సిటీ: పాగిరిలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

రాజాం సిటీ: రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేయడం ద్వారా నేలకు, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేటలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ విధానంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వికాస తరంగిణి అధ్యక్షుడు టీటీవీ రమణమూర్తి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవడం ద్వారా మంచి నడవడిక అలవడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు సీహెచ్ రవీంద్రకుమార్, టి.గోవిందరావు పాల్గొన్నారు.

ఫారం నం INC-25A
పబ్లిక్ కంపెనీని ప్రైవేట్ కంపెనీగా మార్చేందుకు వార్తా పత్రికలో ప్రచురించబడుతున్న ప్రకటన
గౌ॥ ప్రాంతీయ డైరెక్టర్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ – సౌత్ ఈస్ట్ రీజియన్ వారి సమక్షంలో
కంపెనీల చట్టం, 2013, కంపెనీల చట్టం 2013లోని సెక్షన్ 14 మరియు కంపెనీల (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 41 విషయంలో
[illegible]
తేది: 26 ఏప్రిల్, 2023
ప్రదేశం: రాజాం